తెలంగాణ
# వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

తెలంగాణ వెన్నెల వాక్కు TELANGANAVENNELA WAKKU
విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా
రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే
ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా
స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు
ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో
ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :77 05-10-2026 సోమవారం పేజీలు: 4 వెల:03/-

# ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కీలక ముందడుగు

**షియర్ జోన్ దాటిన తవ్వకాలు.. జర్మనీ నుంచి విద్యుత్ లోకోమోటివ్**

**48 గంటల పనిని 20--24 గంటలకు కుదింపు.. త్వరలో 10 గంటల్లోనే పూర్తి చేసే లక్ష్యం**

హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం నిర్మాణ పనుల్లో కీలక పురోగతి నమోదైంది. అత్యంత క్లిష్టమైన భూగర్భ ప్రాంతంగా భావించే షియర్ జోన్‌ను నిర్మాణ బృందం విజయవంతంగా దాటింది.
భూగర్భంలో అనేక సాంకేతిక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ పనులను ముందుకు తీసుకెళు_న్నారు. ఇప్పటివరకు సుమారు 700 మీటర్ల మేర సొరంగం తవ్వకాలు పూర్తయ్యాయి.
గత అనుభవాలతో అప్రమత్తం
గతంలో ఇదే ప్రాంతంలో తవ్వకాలు చేపట్టిన సమయంలో తీవ్ర నీటి సీపేజీ, ఊహించని రాళ్ల ఒత్తిడి కారణంగా పనులకు ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో ఈసారి ముందస్తు రక్షణ చర్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. భూగర్భంలో రాళ్లు కూలకుండా, నీటి ఊటలు సొరంగంలోకి చేరకుండా అధునాతన రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఈ చర్యలతో షియర్ జోన్‌ను సురక్షితంగా అధిగమించినట్లు అధికారులు తెలిపారు.
జర్మనీ నుంచి ఆధునిక యంత్రం
సొరంగంలో ప్రతిరోజూ పేరుకుపోయే మట్టి,



మిగతా వివరాలు రెండో పేజీలో..

# కోలుకుంటున్న కెప్టెన్!

ప్రాణాలకు తెగించి 174 మంది ప్రయాణికులను కాపాడిన భారతీయ కెప్టెన్!
గొడ్డలితో సహ పైలట్ దాడి..
తీవ్ర గాయాల మధ్య విమానాన్ని సురక్షితంగా దించిన స్మిత్ మచ్చార్..



దుబాయ్ న్యూస్
దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన విమానంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగానే సహ పైలట్ ఒక్కసారిగా కెప్టెన్‌పై దాడికి పాల్పడటంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.
భారతీయ విమాన కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై ఒమన్‌కు చెందిన సహ పైలట్ హమామ్ అల్ హమ్మమీ అకస్మాత్తుగా దాడి చేసినట్లు సమాచారం. అత్యవసర సమయాల్లో ఉపయోగించే గొడ్డలితో కెప్టెన్‌పై విరుచుకుపడటంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు.
తీవ్రంగా గాయపడినప్పటికీ కెప్టెన్ స్మిత్ మచ్చార్ ఏమాత్రం భయపడలేదు.

మిగతా వివరాలు రెండో పేజీలో..

# పోడు భూములపై త్వరలో శుభవార్త!

**రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత..**
**అర్హులైన ప్రతి పేద కుటుంబానికి భూ పట్టాలు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

రాష్ట్ర ఖజానాపై తీవ్ర ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాలను ఎక్కడా నిలిపివేయకుండా పక్కాగా అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి మండలంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలన్నింటికీ త్వరలో పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి భూ పట్టాలు అందజేస్తామని స్పష్టం చేశారు.
ముఖ్యంగా దశాబ్దాలుగా నలుగుతున్న పోడు భూముల



మిగతా వివరాలు రెండో పేజీలో..

సమస్యపై త్వరలోనే అర్హులైన రైతులకు శుభవార్త అందిస్తామని మంత్రి ప్రకటించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం

# తెలంగాణలో బార్ & రెస్టారెంట్స్ బంద్..

**ఎక్సైజ్ కమిషనరేట్ ముట్టడికి పిలుపు**

హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ రాష్ట్రంలో ఆబ్కారీ (ఎక్సైజ్) విధానంలో ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నూతన నిబంధనలు, విపరీతంగా పెంచిన ఫీజులకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా బార్ అండ్ రెస్టారెంట్లను మూసివేస్తున్నట్లు తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ సంచలన ప్రకటన చేసింది. అక్టోబర్ 5వ తేదీ నుంచి రాష్ట్రంలోని దాదాపు 1,200కు పైగా బార్ అండ్ రెస్టారెంట్లను నిరవధికంగా బంద్ చేయాలని ఒకే నిర్ణయానికి వచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు.
హైదరాబాద్‌లోని సంఘ కార్యాలయంలో బార్ యజమానుల సంఘం నాయకులు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్ మరియు అరుణ్ గౌడ్ కలసి అత్యవసరంగా సమావేశమై రాష్ట్ర వ్యాప్త బంద్




పిలుపునిచ్చారు. ఈ నిరవధిక సమ్మె నిర్ణయానికి ప్రధాన కారణం ప్రభుత్వం ఇటీవల కేబినెట్ సమావేశంలో ఆమోదించిన కొత్త పన్ను నిబంధనలు, విపరీతంగా పెంచిన ఎక్సైజ్ రుసుములేనని

మిగతా వివరాలు 3వ పేజీలో..

# మహిళా జర్నలిస్టులపై వేధింపులు!

న్యూఢిల్లీ బ్యూరో
కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక జంతర్‌మంతర్ వేదికగా నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పోలీసుల వైఖరిపై తీవ్ర నిరసనలు, వివాదం చెలరేగింది. సంఘటనా స్థలంలో కవరేజ్ కోసం వచ్చిన విధుల్లో ఉన్న ముగ్గురు మహిళా జర్నలిస్టులపై పోలీసులు లైంగికంగా వేధించారనే తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. బాధితులు వెంటనే ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదులు దాఖలు చేశారు. నిరసనల్లో పాల్గొంటున్న ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్న సమయంలో అక్కడ చట్టపరంగా



ఉండాల్సిన మహిళా పోలీసులు ఎందుకు లేరని బాధిత మహిళా జర్నలిస్టులు ప్రశ్నించారు. అలా ప్రశ్నించినందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ఏసీపీ వివేక్ భగత్ తమ పట్ల అత్యంత అభ్యంతరకరంగా, అసభ్యకరంగా వ్యవహరించారని ఆరోపించారు. తమను అసభ్యంగా తాకుతూ బలవంతంగా వెనక్కి నెట్టేశారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా విలేకరులపైనే ఉన్నతాధికారులు ఈ రీతిలో ప్రవర్తించడం పట్ల మీడియా వర్గాలు, పౌర సమాజం నుంచి తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమయ్యాయి. బాధిత మహిళా జర్నలిస్టుల నుంచి అందిన ఈ తీవ్రమైన ఫిర్యాదులపై స్వతంత్రంగా, పారదర్శకంగా మరియు నిష్పక్షపాతంగా విచారణ జరిపించేందుకే కేసును క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేసినట్లు ఢిల్లీ పోలీస్ ఉన్నతాధికారులు ప్రకటించారు. బాధ్యులైన అధికారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా రాజకీయ కలకలం రేపడంతో లోక్‌సభలోని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తక్షణమే స్పందించారు. రాజధానిలో శాంతిభద్రతలు మరియు ఢిల్లీ పోలీస్ శాఖ నేరుగా కేంద్ర హోంశాఖ పరిధిలోనే

మిగతా వివరాలు 3వ పేజీలో..

# వికసిత్ భారత్‌కు కొత్త జీఎస్టీ.. సామాన్యులకు భారీ ఊరట



న్యూఢిల్లీ బ్యూరో
భారతావనిని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పాన్ని నెరవేర్చడంలో సరళమైన, సమర్థవంతమైన పన్ను వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.
దేశంలోని ప్రతి వ్యాపార సంస్థ,

మిగతా వివరాలు 3వ పేజీలో..

# గుడిలో దేవుడి వైపు వెనక్కి తిరిగి ఎందుకు నడవకూడదు..

దేవాలయంలో దర్శనం పూర్తయిన తర్వాత చాలామంది వెంటనే వెనక్కి తిరిగి నడవకుండా.. కొద్దిదూరం వరకు దేవుడి వైపు చూస్తూనే పక్కకు లేదా వెనక్కి అడుగులు వేస్తారు. మరికొందరు గర్భగుడి నుంచి బయటకు వస్తున్నప్పుడు దేవుడి వైపు వెనక్కి తిరగకూడదని పెద్దలు చెబుతుంటారు. ఈ ఆచారం ఎందుకు వచ్చింది? ఇందులో ఏదైనా ప్రత్యేకమైన ఆధ్యాత్మిక భావం ఉందా?దేవుడి దర్శనం పూర్తయిన వెంటనే వెనక్కి తిరిగి వెళ్లకుండా కొద్దిసేపు దేవుడి వైపు చూస్తూ ఉండటాన్ని కొందరు దైవస్మరణను వెంటనే ముగించకుండా, ఆ దర్శన భావాన్ని మనసులో నిలుపుకోవడంగా భావిస్తారు. మనం ఎంతో భక్తితో దర్శనం చేసుకున్న దైవ రూపం నుంచి ఒక్కసారిగా దృష్టి మరల్చకుండా.. ఆ ప్రశాంతతను మనసులో తీసుకెళ్లాలనే భావన ఇందులో కనిపిస్తుంది.అయితే అన్ని దేవాలయాల్లో “వెనక్కి తిరిగి నడవకూడదు” అనే ఒకే విధమైన శాస్త్రీయ లేదా ఆగమ నియమం ఉందని చెప్పలేం. ఆలయ నిర్మాణం, ఆచారం, సంప్రదాయం ఆధారంగా విధానాలు మారుతాయి. కొన్ని ఆలయాల్లో గర్భగుడి ముందు ఎక్కువసేపు నిలబడకూడదు, మార్గాన్ని అడ్డుకోకూడదు వంటి నియమాలే ముఖ్యంగా ఉంటాయి.అయితే ఈ ఆచారం మనకు ఒక అందమైన జీవితపాఠాన్ని మాత్రం చెబుతుంది. మనం ఎంతో గౌరవించే వ్యక్తిని కలిసినప్పుడు వెంటనే తిరిగి వెళ్లకుండా మర్యాదగా వీడ్కోలు చెప్పినట్లే.. దేవుడి దర్శనం తర్వాత కూడా కొద్దిసేపు దైవస్మరణతో బయటకు రావడం భక్తి భావాన్ని పెంచుతుంది.మరోవైపు, కొందరు భక్తులు దర్శనం తర్వాత దేవుడి వైపు చూసుకుంటూ వెనక్కి నడుస్తూ ఇతర భక్తులకు ఇబ్బంది కలిగిస్తుంటారు. ఇది మాత్రం మంచిది కాదు. ఆలయంలో భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా, ఇతరుల దర్శనానికి అడ్డంకి లేకుండా, ఆలయ సిబ్బంది సూచనలను పాటించడం చాలా ముఖ్యం.అందుకే దేవుడి దర్శనం తర్వాత ఒక క్షణం ఆగి.. మనసులో నమస్కరించి.. ఆ తర్వాత ప్రశాంతంగా బయటకు రావడం సరైన భావన. దేవుడి వైపు ఎంతసేపు చూస్తున్నామన్నది కాదు.. దర్శనం తర్వాత మనసులో ఎంతసేపు ఆ దైవస్మరణ నిలిచిందన్నదే ముఖ్యం.గుడి నుంచి బయటకు వచ్చిన వెంటనే దేవుడిని మర్చిపోయి.. మళ్లీ అదే కోపం, అదే తొందర, అదే అహంకారంతో జీవిస్తే దర్శనం కేవలం ఒక కార్యక్రమంగానే మిగిలిపోతుంది.దేవుడి సన్నిధి నుంచి బయటకు వచ్చేటప్పుడు మన అడుగులు గుడి నుంచి దూరం కావచ్చు.. కానీ మనసు మాత్రం దేవుడి దగ్గరే ఉండాలి. దర్శనం ముగిసేది గర్భగుడి వద్ద కాదు.. మనలో దైవస్మరణ ముగిసినప్పుడే.




సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్


# పల్లె ఆరోగ్యానికి ప్రాణవాయువు గ్రామీణ వైద్యులే..!

## వేధింపులు ఆపి తక్షణమే శిక్షణ,గుర్తింపు ఇవ్వాలి!

ఆధునిక వైద్య సాంకేతికత ఎంత ఎత్తుకు ఎదిగినా, పట్టణాలలో రూపుదిద్దుకున్న అత్యాధునిక కార్పొరేట్ ఆసుపత్రులు ఎంతగా మెరిసిపోతున్నా.. నేటికీ మన దేశపు ఆత్మ అయిన గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ప్రజల ప్రాణాలకు నిజమైన రక్షణ కవచంగా నిలుస్తున్నది ఆర్ఎంపీ , పీఎంపీ  వైద్యులే. భారతదేశంలో గ్రామీణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఏ స్థాయిలో ఉందో అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అరకొర వసతులతో మూలుగుతుండటం, ప్రభుత్వ వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తుండటం, అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం నిత్యకృత్యంగా మారింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో పల్లె ప్రజలకు ఏ చిన్న లేదా పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా మొదటి దిక్కు, కొండంత అండ ఆర్ఎంపీ వైద్యులే. అయితే, అహర్నిశలు శ్రమిస్తూ పల్లె ప్రజల ప్రాణాలు కాపాడుతున్న ఈ గ్రామీణ వైద్యుల సేవలను అభినందించాల్సింది పోయి, ప్రభుత్వం, డీఎంహెచ్ఓ, అధికారులు, ఐఎంఏ  వర్గాలు కక్షగట్టినట్లు ప్రవర్తిస్తూ, వారిని నేరస్థులుగా చిత్రీకరిస్తూ దాడులు చేయడం, కేసులు నమోదు చేయడం తీవ్రంగా ఖండించదగిన తీవ్రమైన అంశం.

### పదేళ్ల ఆచరణాత్మక అనుభవానికి విలువ లేదా?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేవలం రెండేళ్ల ఏఎన్ఎమ్  కోర్సు పూర్తి చేసిన నర్సుకు గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించడానికి పూర్తి అర్హత లభిస్తుంది. మరి అలాంటప్పుడు 5 నుండి 10 సంవత్సరాల పాటు పట్టణాల్లోని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో అనుభవజ్ఞులైన వైద్యుల వద్ద రాత్రింబవళ్లు పనిచేసి, అనుభవజ్ఞుల పర్యవేక్షణలో సకల వైద్య విధానాలపై పరిపూర్ణమైన ఆచరణాత్మక అనుభవాన్ని గడించి గ్రామీణ ప్రాంతాలకు వచ్చి వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలను మాత్రం ‘వ్యాజ వైద్యులు’గా ముద్ర వేయడం ఎంతవరకు సమంజసమో అధికారులు ఆలోచించాలి. ఏళ్ల తరబడి క్షేత్రస్థాయిలో సంపాదించిన ఆచరణాత్మక అనుభవం కన్నా కాగితం ముక్కపై ఉన్న డిగ్రీయే గొప్పదా? గ్రామీణ ప్రాంత ప్రజారోగ్య వ్యవస్థలో అనుభవానికి ఉన్న ప్రాధాన్యతను పాలకులతో పాటు ఆరోగ్య శాఖ అధికారులు పూర్తిగా విస్మరించడం వారి సంకుచిత వైఖరికి అద్దం పడుతోంది.

### నగర కార్పొరేట్ వైద్యులు అర్ధరాత్రి పల్లెకు రాగలరా?

పట్టణాల్లోని పెద్ద పెద్ద ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో లక్షలకు లక్షలు అప్పులు చేసి కుమ్మరించి, డిస్చార్జ్ అయి ఊరికి వచ్చిన రోగులకు చివరికి వైద్య సేవలు కొనసాగించాల్సింది గ్రామీణ వైద్యులే. కార్పొరేట్ డాక్టర్లు రాసి ఇచ్చిన అత్యవసర లైఫ్‌సేవింగ్ ఇంజెక్షన్లు ఇవ్వాలన్నా, ఎన్ఎస్ , డిఎన్ఎస్ గ్లూకోజ్ బాటిళ్లు ఎక్కించాలన్నా, సర్జరీల తదనంతర డ్రెస్సింగ్‌లు చేయాలన్నా పల్లెటూర్లలో ఆర్ఎంపీలు తప్ప మరొకరు అందుబాటులో ఉండరు. కార్పొరేట్ వైద్యులు రాసిన మందులు ఆర్ఎంపీలు రోగులకు అందిస్తే రాని నష్టం, అదే ఆర్ఎంపీలు అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స చేస్తే ఏ రకంగా ప్రమాదకరంగా మారుతుందో సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అర్ధరాత్రి వేళ పల్లెటూర్లలో ఎవరికైనా ఆరోగ్యం క్షీణించి ప్రాణాపాయ స్థితి ఏర్పడితే ఏసీ గదుల్లో పడుకునే కార్పొరేట్ డాక్టర్లుగానీ, ప్రైవేట్ హాస్పిటల్స్ డాక్టర్లుగానీ పరిగెత్తుకుంటూ రాగలరా? ఆ క్లిష్ట సమయంలో పిలవగానే వచ్చి, అతి తక్కువ ఖర్చుతో ప్రాథమిక చికిత్స అందించి రోగి ప్రాణాలను నిలబెట్టేది ఈ గ్రామీణ వైద్యులే కదా!

### 50 శాతాల కమీషన్ల కోసం కార్పొరేట్ ఆసుపత్రుల కక్కుర్తి!

పట్టణాల్లో వెలిసిన పెద్ద పెద్ద ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యజమానులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడానికి పల్లెల్లో ఉండే ఆర్ఎంపీల చుట్టూ రోజూ




తిరుగుతున్నారనేది నిత్య సత్యం. తమ ఆసుపత్రులకు రోగులను పంపిస్తే ఏకంగా 50 శాతం కమీషన్లు ఇస్తామని ఆశచూపుతూ, ప్రత్యేక ఏజెంట్లను రంగంలోకి దింపి ఆర్ఎంపీల క్లినిక్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల చుట్టూ ఆర్ఎంపీలు తిరగడం లేదు, ఆ కార్పొరేట్ వ్యాపారులే తమ కమీషన్ల కక్కుర్తి కోసం ఆర్ఎంపీల చుట్టూ తిరుగుతున్నారు. ఈ వ్యాపార కమీషన్ల దందాను వ్యతిరేకిస్తూ, పేద గ్రామీణ ప్రజల జేబులు ఖాళీ కాకుండా కాపాడుతున్న ఆర్ఎంపీలను దెబ్బతీయడానికే పెద్ద వైద్యుల సంఘాలు (ఐఎంఏ), ఆరోగ్య శాఖలోని కొందరు అధికారులు కలిసి కుట్రలు పన్నుతున్నారు.

### జీవోలు కాగితాలకే పరిమితం చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యమే!

గ్రామీణ వైద్యుల సేవలను గుర్తించి, వారికి తగిన శిక్షణనిచ్చి అధికారికంగా ప్రాథమిక వైద్యానికి గుర్తింపు కల్పిస్తామని గతంలోనే ప్రభుత్వం స్పష్టమైన జీవో (జీఓ.నం 1273/429) జారీ చేసింది. కానీ ఆ జీవోను కార్యరూపంలోకి తేకుండా ఏళ్ల తరబడి నాన్చడం పాలకుల అలసత్వానికి, నిర్లక్ష్యానికి నిదర్శనం. సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోకుండా, తనిఖీల పేరుతో దాడులు చేయించడం, కేసులు నమోదు చేయించి వేధింపులకు గురిచేయడం ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రం తగదు. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఆరోగ్య శాఖ ఇప్పటికైనా తన తీరును మార్చుకోవాలి.

### కావాల్సింది కక్షసాధింపు కాదు.. తక్షణ శిక్షణ, అధికారిక గుర్తింపు!

గ్రామీణ ప్రాంతాల్లో అత్యల్ప రుసుముతో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు చేయడం అంటే పల్లె ప్రజారోగ్య వ్యవస్థ వెన్నుముకను విరిచేయడమే. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత చర్యలను, వేధింపులను వెంటనే నిలిపివేయాలి. అర్హులైన ఆర్ఎంపీ, పీఎంపీలందరికీ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే తక్షణమే ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి, వారిని ప్రాథమిక చికిత్స అందించే అధికారిక గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలుగా గుర్తించాలి. పాలకుల నిర్లక్ష్య వైఖరి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో పల్లెల నుంచే పెద్ద ఎత్తున నిరసన జ్వాలలు ఎగిసిపడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు!




వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863


# ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కీలక ముందడుగు

రాళ్లను వేగంగా బయటకు తరలించేందుకు జర్మనీ నుంచి ప్రత్యేక విద్యుత్ లోకోమోటివ్‌ను తెప్పిస్తున్నారు.

ఈ యంత్రం అక్టోబరు చివరి నాటికి ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకోనుంది. దీంతో సొరంగం లోపల నుంచి మట్టి, రాళ్ల తరలింపు ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

మరిన్ని యంత్రాల రాక

తవ్వకాల వేగాన్ని పెంచేందుకు అక్టోబరు నెలలోనే మరో భారీ జంబో డ్రిల్, విద్యుత్ లోడర్లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

గతంలో ఒక నిర్మాణ చక్రాన్ని పూర్తి చేయడానికి సుమారు 48 గంటల సమయం పట్టేది. ప్రస్తుతం దాన్ని నాణ్యతా ప్రమాణాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 20 నుంచి 24 గంటలకు తగ్గించారు.

కొత్త యంత్రాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఒక్కో నిర్మాణ చక్రాన్ని 10 గంటల్లోపే పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

2028 జూన్ నాటికి పూర్తి

2028 జూన్ నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం నిర్మాణ పనులను పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

సొరంగం పూర్తయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆయకట్టుతో పాటు చుట్టుపక్కల మెట్ట ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా సాగు, తాగునీరు అందే అవకాశం ఉంటుంది.

ఈ నేపథ్యంలో పనుల పురోగతిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్మాణ వేగాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు చేపడుతోంది.

# కోలుకుంటున్న కెప్టెన్!

రక్తస్రావం అవుతున్న పరిస్థితుల్లోనూ ప్రయాణికుల ప్రాణాలనే ముందుగా భావించి సమయస్ఫూర్తితో వ్యవహరించారు.

సహ పైలట్‌ను అదుపులోకి తీసుకునేందుకు వీలుగా కాక్‌పిట్ తలుపులను తెరిచారు. దీంతో క్యాబిన్ సిబ్బంది, ప్రయాణికులు వెంటనే కాక్‌పిట్‌లోకి చేరుకుని దాడికి పాల్పడిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

తీవ్ర గాయాలతో ఉన్నప్పటికీ కెప్టెన్ స్మిత్ విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయంలో సురక్షితంగా దించారు. విమానంలో ఉన్న 174 మంది ప్రయాణికుల ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేకుండా అత్యవసర పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొన్నారు.

తబూక్‌లోని ఆసుపత్రిలో ఆయనకు అత్యవసర చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక వైద్య విమానం ద్వారా ఆయనను దుబాయ్‌కు తరలించారు.

దుబాయ్‌లోని ప్రముఖ ఆసుపత్రిలో వైద్యులు శస్త్రచికిత్సలు నిర్వహించి నిరంతర పర్యవేక్షణలో ఉంచారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్యులు వెల్లడించినట్లు సమాచారం.

తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా 174 మంది ప్రయాణికులను కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్ఛార్ సాహసం, సమయస్ఫూర్తిపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

భారత్, ఇజ్రాయెల్ ప్రతినిధులతో పాటు విమానయాన రంగ నిపుణులు, సామాజిక మాధ్యమాల వేదికగా ఆయన ధైర్యాన్ని కొనియాడుతున్నారు. ఈ ఘటనపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. దాడికి దారితీసిన కారణాలు, దాని వెనుక ఉన్న ఉద్దేశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# పోడు భూములపై త్వరలో శుభవార్త!




అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రేగళ్ల గ్రామపంచాయతీ వేదికగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.12 వేల సాయం అందిస్తున్నామని తెలిపారు.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు సన్న బియ్యం పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 చొప్పున అదనపు బోనస్ అందిస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీని కూడా విజయవంతంగా అమలు చేసి రైతాంగాన్ని అప్పుల భారం నుంచి బయటపడేశామని మంత్రి గుర్తుచేశారు.పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గృహ జ్యోతి పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, డ్వాక్రా మహిళల ఆర్థిక అభివృద్ధికి వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని వివరించారు. ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలను సాకారం చేస్తున్నామని పేర్కొన్నారు.

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి సూచించారు. నియోజకవర్గ పరిధిలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

# మామడ అటవీ ప్రాంతంలో డీఎఫ్ఓ 8 కి.మీ ట్రెక్కింగ్



మామడ, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని నిర్మల్ జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మామడ రేంజ్ పరిధిలోని అడవుల్లో ఆదివారం 8 కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) సుశాంత్ సుఖ్‌దేవ్ బోబాడే స్వయంగా కాలినడకన పర్యటిస్తూ అటవీ ప్రాంతంలోని వృక్షసంపద, వన్యప్రాణుల పాదముద్రలు, జీవవైవిధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ వేటను అరికట్టేందుకు, వన్యప్రాణులను కాపాడేందుకు సిబ్బంది నిరంతరం కాలినడకన గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు శ్రీనివాసరావు, రామకృష్ణ, రమేష్ రాథోడ్, ఎఫ్ఎస్‌వో ప్రభాకర్ మరియు బీట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులకు పూర్తి ఉద్యోగ భద్రత కల్పిస్తాం

## వేణుగోపాలాచారి




నిర్మల్ టౌన్, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్టీసీ కార్మికులకు పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత కల్పించేందుకు, వారిని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని నిర్మల్ డిపో ఎన్నికల ఇన్‌ఛార్జ్, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి స్పష్టం చేశారు. ఆదివారం నిర్మల్ ఐబీ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పూర్తి అవగాహన ఉందని, విలీన ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నామన్నారు. అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, అశ్విని మరియు నాయకులు పాల్గొన్నారు.

# గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం

## జిల్లా అధ్యక్షుడిగా సాయన్న



నిర్మల్, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కోశాధికారి తుకారాం సమక్షంలో 2026-28 రెండేళ్ల కాలపరిమితికి ఎన్నికలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా నర్సాపూర్ ఎంఈవో వై. సాయన్న, ప్రధాన కార్యదర్శిగా కుబీర్ ఎంఈవో ఆర్. విజయ్ కుమార్, కోశాధికారిగా బోసి హెచ్‌ఎం జి. రాజశేఖర్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా బాసర ఎంఈవో జి. మైసాజి, సారంగాపూర్ హెచ్‌ఎం కె. విజయ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. మహేందర్, పి. సదానందం బాధ్యతలు అప్పగిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణలో బార్ & రెస్టారెంట్స్ బంద్..

బార్ యజమానుల సంఘం స్పష్టం చేసింది. గతం వరకు రూ. 40 లక్షలుగా ఉన్న బార్ లైసెన్స్ ఫీజును ప్రస్తుతం రూ. 44 లక్షలకు పెంచి యజమానులపై మోయలేని భారాన్ని మోపుతున్నారని వారు తీవ్రంగా విమర్శించారు. దీనికి అదనంగా కొత్తగా అమలులోకి తీసుకొచ్చిన 'ప్రివిలేజ్ ఫీజు' నిబంధన ప్రకారం బార్ స్లాబ్ రేట్లను గతంలో ఉన్న 8 శాతం నుంచి ఏకంగా 20 శాతానికి పెంచడంపై వ్యాపారులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త జీవోల వల్ల ప్రతీ బార్‌పై ప్రతి ఏటా సగటున రూ. 30 లక్షల వరకు అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఇది వ్యాపారాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు .రాష్ట్రంలోని ఒక్కో బార్ నిర్వహణపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సుమారు 60 కుటుంబాల జీవనోపాధి ఆధారపడి ఉందనే సత్యాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్మికులు, సర్వర్లు, క్లీనర్లు, వంటమనుషులు సరఫరాదారులతో కలిపి వేలాది కుటుంబాలు ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. పెరిగిన ఫీజుల భారాన్ని భరించలేక అనేక బార్లు మూతపడే ప్రమాదం ఉందని, దానివల్ల వేలాది మంది ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి తప్పుడు నిర్ణయాల వల్ల ప్రభుత్వానికి పన్ను రాబడులు పెరగకపోగా, ఉన్న ఉపాధి అవకాశాలు పూర్తిగా దెబ్బతింటాయని హెచ్చరించారు. ఇప్పటికే ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి తమ వినతిపత్రాన్ని సమర్పించామని, యజమానుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జీవోలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రభుత్వ వర్గాలు, ఎక్సైజ్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి పెంచిన లైసెన్స్ ఫీజులను, ప్రివిలేజ్ పన్ను స్లాబ్‌లను ఉపసంహరించుకోకపోతే తమ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని బార్ యజమానుల సంఘం హెచ్చరించింది.

# సైన్స్ 'ప్రయోగం' ఆవిరి..



## బడుల్లో ల్యాబ్‌ల పరిస్థితి ఘోరం!

- నిధుల లేమితో తుప్పుపడుతున్న పరికరాలు..
- మరుగున పడుతున్న విద్యార్థుల భవిష్యత్తు



నిర్మల్, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
శాస్త్ర సాంకేతిక రంగాలు నిత్యం కొత్త పుంతలు తొక్కుతున్న ఈ రోజుల్లో, రేపటి శాస్త్రవేత్తలను తయారు చేయాల్సిన ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ బోధన తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. ప్రయోగశాలలు ఉన్నా.. ప్రయోగాలు లేకుండా పోతున్నాయి. పరికరాలు దుమ్ము పట్టి తుప్పు పడుతున్నాయి. రసాయనాలు గడువు ముగిసి నిరుపయోగంగా మారుతున్నాయి. ఫలితంగా విద్యార్థులకు సైన్స్ అంటే పుస్తకంలోని సూత్రాలు, పరీక్షల కోసం గుర్తించే పాఠాలు మాత్రమే మిగులుతున్నాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని నిర్మల్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఒకప్పుడు విద్యార్థులు ఆసక్తిగా ప్రయోగాలు చేసే ల్యాబ్‌లు, ఇప్పుడు తరగతి గదుల్లో పనికిరాని సామగ్రి దాచే గదులుగా మారాయి. నిధుల కొరత, పర్యవేక్షణ లోపం, అధికారులపై పెరుగుతున్న బాధ్యతల భారం కలిసి ప్రయోగాత్మక విద్యను మూలన పడేశాయి.

### ఆగిపోయిన నిధులు.. ఆగిపోయిన ప్రయోగాలు

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్ మెటీరియల్, రసాయనాలు, పరికరాల మరమ్మతుల కోసం ప్రతి ఏటా ప్రత్యేక నిధులు కేటాయించేవారు. పాఠశాల గ్రాంట్ల కింద ల్యాబ్ పరికరాల మరమ్మతు, భర్తీ, రసాయనాల కొనుగోలు కోసం నిధులు ఉపయోగించుకునే అవకాశం కూడా ఉంది. అయితే ఆ నిధులు సకాలంలో, సరిపడా విడుదల కాకపోవడంతో పాఠశాలల్లో ల్యాబ్ నిర్వహణ అంతరించిపోతోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

"మైక్రోస్కోప్ ఉంది, కానీ స్లైడ్‌లు లేవు. బర్నర్ ఉంది, కానీ రసాయనాలు లేవు. పరికరం పాడైతే దాన్ని మరమ్మతు చేయించే నిధి కూడా లేదు. ఇలా ఉంటే ల్యాబ్ ఉన్నట్టే లేనట్టే" అని ఒక ప్రభుత్వ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు అంటున్నారు. దీంతో భౌతిక, రసాయన, జీవశాస్త్ర పాఠాలను కేవలం బోర్డుపై గీసిన చిత్రాలతో, పుస్తకంలోని పేరాలతో బోధించడం తప్పదయింది. ప్రయోగం చేసి నేర్చుకునే అవకాశం లేక విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, పరిశోధనా దృష్టి క్రమంగా తగ్గుతోంది.

### సైన్స్ ఫెయిర్‌లకు అరకొర నిధులు

విద్యార్థుల్లో సృజనాత్మకతను రగిలించే ఇన్‌స్పైర్ కార్యక్రమాలు, సైన్స్ ఎగ్జిబిషన్లు, జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లకు కూడా నిధులు సరిపోవడం లేదని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. గతంలో జిల్లా స్థాయి కార్యక్రమాలకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చయ్యేదని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిధులు చాలా తక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

అయితే, జిల్లా సైన్స్ అధికారులకు జిల్లా స్థాయి సైన్స్, ఆవిష్కరణ కార్యకలాపాల కోసం రూ.50 వేల నిర్వాహక నిధులు కేటాయించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదించింది. కానీ ఈ మొత్తం వందలాది పాఠశాలలు, వేలాది విద్యార్థుల అవసరాలకు దీటుగా లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఎన్జీవోలపై ఆంక్షలు.. పర్యవేక్షణకు కరవు

ప్రభుత్వం నుంచి నిధులు రాకపోగా, సైన్స్ విద్యకు సహకరించడానికి ముందుకొచ్చే స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ భాగస్వామ్యాలపై అనవసర ఆంక్షలు విధిస్తున్నారని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ల్యాబ్ సామగ్రి విరాళంగా ఇవ్వడానికి, సైన్స్ ఫెయిర్‌లకు ఆర్థిక సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్న సంస్థలను ప్రోత్సహించకపోవడం విద్యార్థులకే నష్టమని వారి వాదన.

మరోవైపు, జిల్లా సైన్స్ అధికారులకు డిజిటల్ లెర్నింగ్, బోధనేతర బాధ్యతలు అదనంగా అప్పగించడంతో పాఠశాలల ల్యాబ్‌లను సందర్శించే సమయం లభించడం లేదు. క్షేత్రస్థాయి తనిఖీలకు కావాల్సిన ప్రయాణ అలవెన్సులు కూడా సకాలంలో చెల్లించకపోవడం పర్యవేక్షణను మరింత దుర్బలం చేస్తోంది.

### గ్రామీణ విద్యార్థులకు దూరమవుతున్న సైన్స్

నిర్మల్ జిల్లాలో గ్రామీణ విద్యార్థులకు ప్రయోగాలను చేరువ చేసే సైన్స్ సెంటర్లు, సైన్స్ మ్యూజియంలు లేకపోవడం కూడా పెద్ద లోటు. బాసర జ్ఞాన సరస్వతి ఆలయం, నిర్మల్ కొయ్య బొమ్మల హస్తకళల వంటి చారిత్రక, సాంస్కృతిక గర్వకారణాలున్న ఈ ప్రాంత విద్యార్థుల్లో దాగిన ప్రతిభకు సైన్స్ వేదిక దొరకకపోవడం దురదృష్టం.

పేద, గ్రామీణ నేపథ్యం ఉన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య దూరమైతే, వారి భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకమవుతుంది. పుస్తకంలో చదివిన సూత్రం కంటే, చేతిలో పట్టి చేసిన ప్రయోగమే విద్యార్థి మనసులో శాశ్వతంగా నిలిచిపోతుంది.

### కొత్త చర్యలు ఉన్నా.. అమలు ముఖ్యం

రాష్ట్ర ప్రభుత్వం 2026-27 విద్యా సంవత్సరంలో 287 ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్ గదుల నిర్మాణం, పరికరాల ఏర్పాటు కోసం రూ.74.62 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఒక్కో ఎంపికైన పాఠశాలకు సుమారు రూ.25 లక్షల ల్యాబ్ గది నిర్మాణానికి, రూ.1 లక్ష పరికరాల కొనుగోలుకు కేటాయించింది. ఇది స్వాగతించదగిన చర్య అయినా, ఇప్పటికే ఉన్న ల్యాబ్‌ల మరమ్మతు, రసాయనాల కొనుగోలు, నిరంతర నిర్వహణకు ప్రత్యేక, స్థిరమైన నిధులు అవసరమని ఉపాధ్యాయులు స్పష్టం చేస్తున్నారు.

ల్యాబ్‌లను పునరుద్ధరించడం, పరికరాలను భర్తీ చేయడం, రసాయనాలకు ప్రతి ఏటా నిధులు కేటాయించడం, జిల్లా సైన్స్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు, ప్రయాణ ఖర్చులు కల్పించడం, ఎన్జీవోల భాగస్వామ్యానికి అనుమతి ఇవ్వడం వంటి చర్యలు తక్షణమే అవసరమని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

సైన్స్ ల్యాబ్ అంటే కేవలం పరికరాల గది కాదు; అది విద్యార్థి ఆలోచనను ప్రశ్నించే, ఆవిష్కరించే, కనిపెట్టే వేదిక. ఆ వేదికను నిర్లక్ష్యం చేస్తే, రేపటి శాస్త్రవేత్తల స్థానంలో కేవలం పరీక్షల మార్కుల కోసం పాఠాలు గుర్తించే తరం మాత్రమే మిగులుతుంది.

తెలంగాణ
వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871


# ఖానాపూర్‌లో డెంగ్యూ దడ..

## వైరల్ జ్వరాలతో వణుకు!

### సీఎస్సీ ఓపీకి రోజూ 350--400 మంది.. ఆస్పత్రుల్లో పెరుగుతున్న రద్దీ

ఖానాపూర్, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):



ఖానాపూర్ పట్టణంలో వైరల్ జ్వరాల వ్యాప్తితో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న అసాధారణ మార్పులు, ఎండల తీవ్రత కారణంగా పలు కాలనీల్లో జ్వర బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది.
చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పలువురు జ్వరాలతో బాధపడుతూ వైద్యం కోసం ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.
ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి సీఎస్సీ ఓపీకి ప్రతిరోజూ సుమారు 350 నుంచి 400 మంది వివిధ రకాల జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో చికిత్స కోసం వస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలోని వార్డుల్లోనూ జ్వర బాధితులతో రద్దీ పెరుగుతోంది. పరిస్థితిని బట్టి కొంతమంది బాధితులను మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నట్లు వైద్యులు ఉపేందర్ తెలిపారు.
పట్టణంలోని పలు ప్రాంతాల్లో జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో డెంగ్యూ కేసులపై కూడా ప్రజల్లో ఆందోళన నెలకొంది. అయితే ప్రతి జ్వరాన్ని డెంగ్యూ కేసుగా భావించకుండా వైద్య పరీక్షల అనంతరం నిర్ధారించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.
జ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు పట్టణంలోని కాలనీల్లో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేయడంతో పాటు దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయడం, ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు. పరిస్థితిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పించాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రీ-సర్వేతో రైతులకు శాశ్వత పరిష్కారం

సారంగాపూర్, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):ప్రభుత్వం చేపడుతున్న భూముల సమగ్ర రీ-సర్వే విషయంలో రైతులు ఎలాంటి అపోహలు, భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని సారంగాపూర్ తహశీల్దార్ విజయ్‌కాంత్ రావు స్పష్టం చేశారు. మండల పరిధిలోని నాగపూర్, కౌట్ల (బి) గ్రామాలను రీ-సర్వే కోసం ప్రభుత్వం ఎంపిక చేయగా, నాగపూర్‌లో మొదటి విడత సర్వే పూర్తయిందని తెలిపారు. ప్రస్తుతం కౌట్ల (బి) గ్రామంలో గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రతి సర్వే నంబర్‌ను సర్వేయర్ల ద్వారా క్షేత్రస్థాయిలో డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతుకు అధికారిక సమాచార నోటీసు అందజేస్తారని, రైతు సమక్షంలోనే కొలతలు వేసి జియో ట్యాగింగ్ చేస్తామని వివరించారు. భూ సరిహద్దుల్లో హెచ్చుతగ్గులు ఉంటే పరిష్కరించి పారదర్శకంగా పత్రాలు అందజేస్తామన్నారు.

## మైనర్ల డ్రైవింగ్‌పై జిల్లావ్యాప్తంగా పోలీసుల స్పెషల్ డ్రైవ్

నిర్మల్, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):




మైనర్లు వాహనాలు నడపడాన్ని అరికట్టేందుకు నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు ప్రధాన రహదారులు, రద్దీ కూడళ్లు, పాఠశాలలు మరియు కళాశాలల పరిసరాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. మైనర్ డ్రైవింగ్‌తో పాటు హెల్మెట్, సీటుబెల్ట్ ధరించని వారిపై, సరైన పత్రాలు లేని వాహనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్డు ప్రమాదాలకు కారణం కావద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.

## బీరవెల్లి పాఠశాలలో ఘనంగా

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సారంగాపూర్, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సారంగాపూర్ మండల పరిధిలోని బీరవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004-2005 విద్యాసంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఉత్సాహంగా జరిగింది. దాదాపు 21 సంవత్సరాల తర్వాత తోటి మిత్రులంతా ఒకే చోట కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులు నాగన్న (గణితం), నరసింహా చారి (భౌతిక శాస్త్రం), నర్సయ్య (జీవశాస్త్రం), పద్మావతి (తెలుగు) లను విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కడెంలో స్వప్న ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

కడెం/దస్తురాబాద్, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):




నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలో ఆదివారం స్వప్న మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కార్డియో, ఆర్థో వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ స్వప్న శశికాంత్ నేతృత్వంలో నిపుణులైన వైద్య బృందం రోగులకు గుండె, ఎముకల సంబంధిత వ్యాధులకు అత్యాధునిక పరీక్షలు నిర్వహించింది. ఉచితంగా ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు చేసి అవసరమైన మందులు, సలహాలు అందించారు. ఈ శిబిరాన్ని కడెం ఎస్సై సాయి సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, గ్రామీణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు ఉచితంగా అందిస్తున్న డాక్టర్ స్వప్న బృందాన్ని అభినందించారు. పేద రోగుల కోసం ఇలాంటి సేవా శిబిరాలు మరిన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

సారంగాపూర్, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సారంగాపూర్ మండలంలోని 33/11 కేవీ చించోలి (బి) విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో అత్యవసర మరమ్మతు పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు చించోలి (బి), ధని, గోపాల్‌పేట్, ద్యాంగాపూర్, రాణాపూర్ మరియు చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. సోమవారం పగటిపూట విద్యుత్ నిలిపివేత ఉన్నందున రైతులకు ఇబ్బంది కలగకుండా ఆదివారం రాత్రి 12:00 గంటల నుంచే వ్యవసాయానికి త్రీ-ఫేస్ కరెంట్ సరఫరా చేస్తున్నామని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

## అక్టోబర్ 9న బహుజన రాజ్యాధికార సంకల్ప సభ: బీఎస్పీ

సారంగాపూర్/నిర్మల్, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):



బీఎస్పీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరాం 20వ వర్ధంతిని పురస్కరించుకుని అక్టోబర్ 9న ఆదిలాబాద్ రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సంకల్ప సభను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్ మోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం సారంగాపూర్ మండలంలోని ప్యారమూర్, బీరెల్లి, మండల కేంద్రాల్లో సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. పూలే, అంబేద్కర్, కాన్షీరాంల ఆశయ సాధనకు బహుజనులు ఐక్యం కావాలన్నారు. ఈ సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు క్యాతం సాగర్, నాయకులు రాజేష్, దత్తు, సునంద పాల్గొన్నారు.

## నేడు నిర్మల్‌లో మంత్రుల పర్యటన.. కలెక్టరేట్‌లో సమీక్ష

నిర్మల్, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):నిర్మల్ జిల్లాలో సోమవారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నట్లు కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి అధికారులతో వివిధ శాఖల ప్రగతిపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. మంత్రుల పర్యటన ఉన్నప్పటికీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.



## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి ఘన సన్మానం

లక్ష్మణచాంద, అక్టోబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):



లక్ష్మణచాంద మండలానికి చెందిన మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్-మంజుల దంపతుల కుమారుడు నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఆదివారం లక్ష్మణచాందలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని స్థానిక ప్రజాప్రతినిధులు శాలువాతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో ఉన్నత వైద్యుడిగా ఎదిగి పేదలకు సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సిరాజ్, కల్లెడ భూమన్న, ఓస రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER